## క్లుప్తంగా

### పాలుట్ల రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు



రంగనాథస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**బేతంచెర్ల:** మండల పరిధిలోని గూటుపల్లె సమీపంలో వెలసిన పాలుట్ల రంగనాథస్వామి ఆలయంలో పుష్యమాసం శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మద్దిలేటి, అర్చకుడు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

### గ్రామాల్లో పింఛన్లపై విచారణ

**కొలిమిగుండ్ల:** మండలంలోని పలు గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమై రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలను శనివారం నంద్యాలకు చెందిన వైద్య బృందం విచారణ చేసింది. అంకిరెడ్డిపల్లె, తుమ్మలపెంట, మదనంతపురం, నాగిశెట్టిపల్లె, గొర్విమానుపల్లె, బెలుం తదితర గ్రామాల్లో 22 పింఛన్లపై విచారణ జరిగింది. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి ఆరోగ్య స్థితిగతుల గురించి ఆరా తీశారు. అక్కడే ఫొటోలు తీసుకొని అప్‌లోడ్ చేశారు. లబ్ధిదారులు నిజంగా అర్హులా కాదా అని క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఇందులో చాలా మంది మంచానికి పరిమితమై లేవలేని స్థితిలో ఉన్నారు. వైద్య బృందం తనిఖీకి రావడంతో తమకు పింఛన్ వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు.

### డ్రైవర్లకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**డోన్ రూరల్:** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఆర్టీఓ క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. కర్నూలు రమేష్ ఆస్పత్రి సహకారంతో 76 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. డ్రైవర్లకు కంటి చూపు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన యువకుడు

**కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల– నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. బనగానపల్లె మండలం హుసేనాపురంకు చెందిన గన అనే యువకుడు సొంత పని నిమిత్తం బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కోవెలకుంట్ల శివారులోని ఇందిరమ్మ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గనకు కాలిపాదం నుజ్జయింది. అతన్ని 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### యూహెచ్‌ఎస్‌కు నీటి ట్యాంకు అందజేత



నీటి ట్యాంకును అందజేస్తున్న క్లబ్ సభ్యులు

**బేతంచెర్ల:** సమాజంలో లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని వైద్యురాలు ప్రియాంక అన్నారు. శనివారం బేతంచెర్ల డ్రైవర్స్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు రోగుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తాగునీటి ట్యాంకును అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు విష్ణు, వలిబాషా, కేశాలు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టు నేత నరసింహయ్యకు నివాళి

**బేతంచెర్ల:** కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ తెలకపల్లి నరసింహయ్య అని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఎల్లయ్య, సాదిక్ హుసేన్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి మధుశేఖర్ ఆధ్వర్యంలో నరసింహయ్య 6వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు చేసి ప్రజానాయకుడిగా, ఉద్యమ నేతగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలని కోరారు.

# రోడ్డు భద్రత.. బాధ్యత

- అక్రమార్కుల ఆట కట్టిస్తున్న డోన్ రవాణా అధికారులు
- డబుల్ నంబర్లు, పర్మిట్లు లేకుండా తిరిగే వాహనాలకు భారీ జరిమానాలు
- లక్ష్యాన్ని అధిగమించి ప్రశంసలు
- ఘనంగా జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు



పర్మిట్లు లేకుండా తిరిగే వాహనానికి జరిమానా విధిస్తున్న ఎంవీఐ (ఫైల్)



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**డోన్:** రయ్.. రయ్ మంటూ రేయింబవళ్లు డోన్ మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి(కన్యాకుమారి–కశ్మీర్)పై అనేక వాహనాలు పరుగులు పెడుతుంటాయి. సరుకు రవాణా వాహనాలు, ప్రయాణికుల వాహనాలు ప్రతి ఐదు నిమిషాలకు 15 నుంచి 20 వరకు ఈ మార్గంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధాన నగరాలైన హైదరాబాద్ - బెంగళూరు మార్గం కావడంతో అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి.

**నిబంధనలు అతిక్రమించే వాహనాలే అధికం**

ఈ మార్గంలో అనేక వాహన యజమానులు నిబంధనలను అతిక్రమించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుంటారు. ఇలాంటి అక్రమార్కుల పని పట్టేందుకే ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదుగురు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఒక రవాణాశాఖ ఉన్నతాధికారి, ముగ్గురు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లను ఏర్పాటు చేసింది. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆదాయాన్ని రెట్టింపు చేసుకునేందుకు కిందిస్థాయి అధికారులను ప్రభుత్వం నియమించాల్సిన అవసరం ఎంతో ఉంది.

**కేసులు అధికం**

ఈ ఏడాది ప్రభుత్వం రూ.1.05 కోట్ల ఆదాయాన్ని సమకూర్చాలని లక్ష్యం విధించింది. డోన్ కార్యాలయం పరిధిలో 490 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.1.50 కోట్లను వసూలు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదాయాన్ని ఎగ్గొట్టేందుకు ఒకే నంబర్‌ను వివిధ వాహనాలకు పెట్టడం, డూప్లికేట్ పర్మిట్లు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంలో కొంత మంది వాహన యజమానులు ఆరితేరారని వివరించారు. ఎలాంటి పర్మిట్లు లేకుండా ఏడాది పొడవునా తిరిగిన వాహనానికి రూ.17 లక్షల జరిమాన విధించామని, రాజస్థాన్, నాగలాండ్, ఉత్తరప్రదేశ్‌కి చెందిన ప్రైవేటు ట్రావెల్ బస్సులకు రూ.3 నుంచి రూ.5 లక్షల చొప్పున అపరాధ రుసుం విధించి వసూలు చేశామన్నారు.

**సామాజిక సేవా కార్యక్రమాలు**

సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నట్లుగా ప్రతి డ్రైవర్‌కు సరైన కంటిచూపు లేకపోతే యావత్ కుటుంబమే అంధకారమవుతుంది. రెప్పపాటు కునుకిపాటు నిర్లక్ష్యం అందరి జీవితాల్లో విషాదాలను నింపుతుంది. ఇది గమనించి ఏటా రెండుసార్లు ఆటో, ట్రాక్టర్, లారీ, జీపు, వ్యాను, స్కూల్ బస్సు డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నారు. కళ్లద్దాలు కూడా అంజేస్తున్నారు.



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎంవీఐ క్రాంతికుమార్ (ఫైల్)

వాహనాల ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు తరచుగా వాహన తనిఖీలను చేయడం, కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని యజమానులు, డ్రైవర్లను హెచ్చరించడం, ప్రమాదాలపై అవగాహన సదస్సులు, చర్చా గోష్టిలు, ర్యాలీలు నిర్వహించడం చేస్తూనే ఉన్నారు.

> **అంకిత భావంతో కృషి చేస్తున్నాం**
>
> ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు సిబ్బంది సహకారంతో రేయింబవళ్లు అంకితభావంతో కృషిచేస్తున్నాం. వాహనాల డ్రైవర్లను నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాం. ప్రభుత్వ ఆదాయానికి అక్రమ మార్గాల్లో గండికొట్టే అక్రమార్కుల భరతం పట్టేందుకు ఏ మాత్రం వెనకడుగు వేయం.
>
> –క్రాంతికుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, డోన్

**13 ఏళ్లలో 8 అవార్డులు**

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా సమర్థవంతంగా పని చేస్తున్న క్రాంతికుమార్‌కు తన 13 ఏళ్ల సర్వీస్ కాలంలో ప్రభుత్వం 8 సార్లు అవార్డు ఇచ్చి సత్కరించింది. గత ఏడాది కూడా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నారు.

### యానాదుల సమస్యలపై విచారణ



సీమలతిప్ప కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ, తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్

**సంజామల:** మండల పరిధిలోని గిద్దలూరు గ్రామం యానాదుల కాలనీల వాసుల సమస్యలపై శనివారం ఎంపీడీఓ, తహసీల్దార్ విచారణ చేశారు. యానాదుల సమస్యలపై ''ఇంతకు మేమెవరం'' అనే శీర్షికతో శనివారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ అనిల్ కుమార్ గిద్దలూరు గ్రామం సీమలతిప్ప కాలనీకి చేరుకుని అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాలా మందికి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు లేవని నిర్ధారించారు. త్వరలో కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. వారి వెంట ఈఓఆర్డీ రాధికారెడ్డి, హౌసింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి



టైఫాయిడ్ కిట్లను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

**కొలిమిగుండ్ల:** ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట రమణ సూచించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్, మందులను పరిశీలించారు. సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. ఓపీ సంఖ్య తక్కువగా ఉండడంతో ఎందుకు తక్కువగా ఉన్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ల్యాబ్‌లో గతంలోనే అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారని.. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలో కల్పిస్తున్న వైద్య సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా టెస్ట్‌లు ఇక్కడే జరుగుతాయన్నారు. వాటికి సంబంధించిన పరికరాలన్నీ అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. మందుల కొరత లేదని పూర్తి స్థాయిలో ఉన్నాయని చెప్పారు. విధులపై సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందేలా చూడాలన్నారు.

### ఉపాధ్యాయ సమస్యలపై వినతి

**కోవెలకుంట్ల:** ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం కడప ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌కు వినతిపత్రం అందజేశారు. వేసవి సెలవుల్లో చేపట్టే ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల పెర్ఫార్మెన్స్ పాయింట్లను పరిగణలోకి తీసుకుంటే బదిలీల్లో పైరవీలకు అవకాశం ఏర్పడే అస్కారం ఉందన్నారు.



ఆర్జేడీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కేవలం సర్వీస్ పాయింట్లు, స్టేషన్ పాయింట్లను ప్రామాణికంగా తీసుకుని బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు.

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష



బనగానపల్లె: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

**బనగానపల్లె రూరల్:** పట్టణంలోని నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 337 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా బనగానపల్లె జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 169 మందికి గాను 18 మంది, అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 168 మందికి గాను 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల అధికారులు బాలగంగాధర్‌రెడ్డి, రామకృష్ణ తెలిపారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగింది. పరీక్ష కేంద్రాల సీఎల్ఓలుగా ఏపీ మోడల్ స్కూల్స్ బనగానపల్లె, అవుకు ప్రిన్సిపాల్స్ రామలక్ష్మీ, హేమమి వ్యవహరించారు.

**కోవెలకుంట్ల కేంద్రంలో 40 మంది గైర్హాజరు**

**కోవెలకుంట్ల:** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం బనవాసి నవోదయ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన 261 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 220 మంది విద్యార్థులు హాజరయ్యారు. 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్ర చీఫ్ అధికారిగా పాఠశాల హెచ్ఎం రాజయ్య, పరిశీలకుడిగా నవోదయ పాఠశాల నుంచి వెంకటయ్య హాజరయ్యారు.

**డోన్‌లో 73 మంది గైర్హాజరు**

**డోన్ టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రవేశ పరీక్షకు మొత్తం 321 మంది విద్యార్థులకు గాను 248 హాజరయ్యారు. 73 మంది గైర్హాజరైనట్లు పాఠశాల హెచ్ఎం మైమున్నీసా తెలిపారు. బనవాసి నవోదయ స్కూల్‌కు చెందిన సీఎల్ఓ శివరాముదు పర్యవేక్షించారు.

## ఎస్టీలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

**డోన్ టౌన్:** కూటమి ప్రభుత్వంలో ఎస్టీలకు నామినేటెడ్ పదవులు అంతంత మాత్రమేనని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు, నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు నాగసారి సుంకన్న, కుశలన్న అన్నారు. శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గిరిజనులు ఆర్థిక, సామాజిక, రాజకీయ పురోగతి నోచుకోని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజన బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గాలేటి శ్రీనివాసులు, రుద్రవరం మండల అధ్యక్షుడు కలింగిరి మద్దిలేటి, బనగానపల్లె మండల ప్రధాన కార్యదర్శి ఈసారి సుంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రైబల్ ఫెడరేషన్ నాయకులు

### రాజధానిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి

**డోన్ రూరల్:** రాజధానిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్‌యాదవ్, మాజీ జిల్లా అధ్యక్షుడు పులిశేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నక్కిరామన్న భవనంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిని ఫ్రీజోన్‌గా ప్రకటించి, అక్కడ ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలన్నారు. తొలగించిన వలంటీర్లను తీసుకొని వారికి రూ.10 వేలు వేతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 22న నంద్యాల జిల్లా రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరగనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు నాగరాజు, దివాకర్, రాఘవేంద్ర, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

### భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం



దత్తాత్రేయశర్మను సత్కరించిన తత్సంగ సభ్యులు

**డోన్ టౌన్:** భగవద్గీతలోని అంశాలు ప్రతి మనిషి ఆచరించదగినవని శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. శనివారం పట్టణంలోని రాజా విజయ్‌కుమార్ ఇంటిలో శ్రీకృష్ణ భగవద్గీత తత్సంగ కమిటీ సభ్యులు చేసిన భగవద్గీత పారాయణ కార్యక్రమానికి ఆయనతో పాటు తొగట సురేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భగవద్గీత బోధనలు చేస్తూ వాటి ప్రాముఖ్యత మనిషి జీవితంలో ముడిపడి ఉన్న విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకుడు మలిశెట్టి జగన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ఉరుసు



మౌలాలిస్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

**బనగానపల్లె రూరల్:** పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన మౌలాలిస్వామి దర్గాలో శనివారం ఉరుసు భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉర్సు సందర్భంగా హిందూ ముస్లింలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ఫాతెహాలు సమర్పించారు. ఈ సందర్భంగా దర్గాలో భక్తులకు అన్నదానం చేశారు.

## దెబ్బతిన్న ఆర్టీసీ బస్టాండ్ రోడ్లు



**కోవెలకుంట్ల:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. బస్టాండ్ ప్రాంగణం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ చేరుతోంది. రోజుల తరబడి నీరు నిలిచి ఉండడంతో బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లే రోడ్డు, బస్సులు బయటకు వచ్చే రోడ్డు దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తున్నాయి. వాహన చోదకులు ఈ రోడ్లపై వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ చేరుతుండడంతో బస్టాండ్‌లోకి వెళ్లే ద్విచక్ర వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురి అవుతున్నారు. శుక్రవారం రాత్రి బస్టాండ్ బయటకు వచ్చే రోడ్డులో కొంత మేర మరమ్మతులు చేపట్టారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## వానపాముల పెంపక కేంద్రం ప్రారంభం

**కోవెలకుంట్ల:** స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం వానపాముల పెంపక కేంద్రాన్ని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ప్రారంభించారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వర్మి కంపోస్టు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థులకు శిక్షణా కేంద్రంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా ప్రతి నెలా 50 బస్తాల వర్మికంపోస్టు ఎరువు తయారు చేయనున్నట్లు తెలిపారు. వానపాముల పెంపక కేంద్ర నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన జంతుశాస్త్ర అధ్యాపకుడు రామసుబ్బారెడ్డిని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు నాగేశ్వరరెడ్డి, కృష్ణకాంక తదితరులు పాల్గొన్నారు.



వానపాముల పెంపక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

**మంత్రి బీసీని కలిసిన అధ్యాపకులు**

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కోవెలకుంట్లకు రాగా స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు మంత్రిని కలిశారు. కళాశాల ఆవరణలో అంతర్గత రోడ్లు నిర్మించాలని మంత్రిని కోరగా స్పందించిన మంత్రి రోడ్లు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### మంత్రి బీసీ రక్తదానం

**బనగానపల్లె:** ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రారంభించారు. మొదటగా ఆయన రక్తదానం చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత




కోవెలకుంట్ల: స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న టంగుటూరు పీహెచ్‌సీ సిబ్బంది



అవుకులో..

**కోవెలకుంట్ల:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా–స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాండురంగస్వామి దేవాలయం నుంచి గ్రామ పంచాయతీ సర్కిల్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పాండురంగస్వామి ఆలయ ఆవరణలో మంత్రి చెత్త తొలగింపు పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వల్లే దోమలు ప్రబలి మలేరియా, తదితర విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీడీఓ వరప్రసాదరావు, ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్‌నాయుడు, మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ ప్రసాదరెడ్డి పాల్గొన్నారు. అలాగే రేవనూరు పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు.

–బనగానపల్లె రూరల్: మండలంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకటరణమ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్తను తొలగించారు. అలాగే టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది ఆస్పత్రి ప్రాంగణంలోని చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. సర్పంచ్ సూర్యనాగమద్దిలేటి, పీఎస్ శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

–బేతంచెర్ల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వైద్యులు చరణ్‌రాజు, వాణి స్వప్న ప్రియ అన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శేషారెడ్డి సీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

–కొలిమిగుండ్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామం కావాలని తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి అన్నారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బందితో కలిసి చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. స్థానిక పీహెచ్‌సీలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు వైద్య సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ పరిసరాలు శుభ్రం చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. చింతలాయిపల్లెలోని విలేజ్ హెల్త్ యూనిట్ వద్ద పారిశుద్ధ్య పనులను డీఎంఅండ్‌హెచ్ఓ వెంకట రమణ పరిశీలించారు.

–డోన్: మున్సిపాలిటీని అత్యంత పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు పట్టుదలతో పనిచేయాలని ఆర్డీఓ నరసింహులు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ సూచించారు. స్థానిక పాతబస్టాండ్‌లో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తామన్నారు.

–అవుకు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి చెత్తను తొలగించారు. హౌసింగ్ ఏఈ క్రిష్ణారెడ్డి, ఈఓ హరిప్రసాద్, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

–ప్యాపిలి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి అన్నారు. స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.